## అధ్యాయము 21

# నిబంధన గ్రంథము

### (భాగము 2)

21వ అధ్యాయములో, దేవుడు నిబంధనా గ్రంథములో ఉండవలసిన విశేష నియమాలను మోషేకు ఇచ్చుటను కొనసాగించాడు (20:22-23:33). దేవుడు ఈ నియమాలకు దాత అని మోషే వాటిని ప్రజలకు అందించాలని జ్ఞాపకము చేస్తూ ఈ అధ్యాయము ఆరంభమవుతుంది (21:1). తరువాత దేవుడు బానిసత్వమునకు సంబంధించిన నియమాలను ఇస్తూ, బానిసత్వ కాలము ఎప్పుడు ఎలా ముగుస్తుందో తెలియజేస్తున్నాడు (21:2-11). హత్య, పొరపాటున చంపుట, వ్యక్తిగత గాయములు, మరియు ఇతర సంబంధిత నేరములను గూర్చి వ్యవహరించు వ్యక్తిగత గాయములును గూర్చి ఆయన నియమాలను ఇస్తున్నాడు (21:12-27). అధ్యాయము యొక్క చివరిలో ఎద్దులను గూర్చిన నియమాలు ఉన్నాయి. ఇవి ఎద్దులు ప్రజలను గాయపరచిన సందర్భాలను, మరియు ఎద్దులు గాయపడిన సందర్భాలను గూర్చినవి (21:28-36).

### బానిసత్వమునకు సంబంధించిన నియమాలు (21:1-11)

#### ఆరు సంవత్సరాలు సేవించు దాసులు (21:1-6)

**1నీవు వారికి నియమింపవలసిన న్యాయవిధులేమనగా 2- నీవు హెబ్రీయుడైన దాసుని కొనినయెడల వాడు ఆరు సంవత్సరములు దాసుడై యుండి యేడవ సంవత్సరమున ఏమియు ఇయ్యకయే నిన్ను విడిచి స్వతంత్రుడగును. 3వాడు ఒంటిగా వచ్చినయెడల ఒంటిగానే వెళ్లవచ్చును. వానికి భార్య యుండినయెడల వాని భార్య వానితోకూడ వెళ్లవచ్చును. 4వాని యజమానుడు వానికి భార్యనిచ్చిన తరువాత ఆమె వానివలన కుమారులనైనను కుమార్తెలనైనను కనినయెడల ఆ భార్యయు ఆమె పిల్లలును ఆమె యజమానుని సొత్తగుదురుకాని వాడు ఒంటిగానే పోవలెను. 5అయితే ఆ దాసుడు - నేను నా యజమానుని నా భార్యను నా పిల్లలను ప్రేమించుచున్నాను, నేను వారిని విడిచి స్వతంత్రుడనై పోనొల్లనని నిజముగా చెప్పిన యెడల 6వాని యజమానుడు దేవుని యొద్దకు వానిని తీసికొని రావలెను, మరియు వాని యజమానుడు తలుపునొద్దకైనను ద్వారబంధమునొద్దకైనను వాని తోడుకొనిపోయి వాని**

**చెవిని కదురుతో గుచ్చవలెను. తరువాత వాడు నిరంతరము వానికి దాసుడైయుండును.**

**వచనము 1.** పది ఆజ్ఞలు ఇచ్చిన సమయములో వలె దేవుడు ఇప్పుడు ప్రజలతో నేరుగా మాటలాడుటలేదు. అయితే, ఈ అవసరతలను దేవుడు మోషేకు ఇస్తున్నాడు, మరియు వాటిని ఇశ్రాయేలుకు తెలియజేయుట మోషే యొక్క బాధ్యత (20:22). నిర్గమ. 21-23 అధ్యాయాలలో ఇవ్వబడిన నియమాలను **విధులు** (מִשְׁפָּטִים, *mishpatim*) లేక "తీర్పులు" (KJV) అంటారు.[1] ఈ పదము యొక్క ఉపయోగం ఇవ్వబడిన నియమాలు మునుపటి వాటి కంటే ముఖ్యమైనవి అన్నట్లు సూచిస్తుంది - ప్రాముఖ్యతలో కాకపోయినా, కనీసం విధానములో. ఇవి "నాగరికుల మధ్య ఉన్న వివాదాల విషయంలో ఇశ్రాయేలు న్యాయాధిపతులకు మార్గదర్శకముగా" ఉండునట్లు సూచిస్తుందని Walter C. Kaiser, Jr., చెప్పాడు.[2] John I. Durham ఈ పదమును "దిశ చూపు నిర్ణయాలు"గా అనువదించి తరువాత నియమాలను "వ్యాజ్య నిర్ణయాలు" లేక "పూర్వ నియమాలు" అని చెబుతూ, అవి పది ఆజ్ఞలలో ఇవ్వబడిన "చెప్పబడిన నియమాలకు" అన్వయాలుగా ఉన్నాయని చెప్పాడు.[3]

**వచనము 2.** ఈ విధుల యొక్క మొదటి భాగము **హెబ్రీ దాసుని కొనుటను** మరియు విడిచిపెట్టుటను గూర్చి తెలియజేస్తుంది. రెండు సందర్భాలు పరిగణించబడ్డాయి: **ఆరు సంవత్సరాలు** దాసునిగా ఉన్నవాడు (21:1-6) మరియు యజమానుని కొరకు లేక యజమానుని కుమారుని కొరకు భార్యగా కొనబడిన దాసీ (21:7-11).

పురాతన లోకములో జయించుట ద్వారా లేక కొనుట ద్వారా దాసులను సంపాదించుకొనేవారు. ఒక దేశము మరొక దేశముపై విజయము సాధించినప్పుడు, జయించబడినవారు "యుద్ధములో మిగులలు"గా మారగా జయించినవారు వారిని బానిసలుగా తీసుకొనిపెళ్లే వారు. బానిసలుగా కొనిపోబడుట వినుటకు క్రూరంగా ఉన్నా, దానికి ప్రత్యామ్నాయం మరణం. పేదరికము ద్వారా కూడా ప్రజలు బానిసలుగా మారేవారు; అప్పులు తీర్చుకొనుటకు ఒకడు తన్నుతాను లేక తన కుమారులను అమ్ముటకు నిర్ణయించవచ్చు. యుద్ధములో పొందుకున్న బానిసల యొక్క పిల్లలు లేక కొనబడిన అన్య బానిసల పిల్లలు ఆ కుటుంబములోనికి బానిసలుగా జన్మిస్తారు.

21:1-11లో చర్చించబడిన దాసులు వెల పెట్టి కొనబడిన "హెబ్రీ" దాసులు. "హెబ్రీ" (עִבְרִי, *'ibri*) అను పదము "ఇశ్రాయేలీయుడు" అని అర్థమునిచ్చు దాని కంటే విశాలమైన పద్ధతిలో ఉపయోగించబడింది - అనగా ఇది భూమిలేని ప్రజల గుంపును సంబోధిస్తుంది అని మరియు కేవలం పేద ఇశ్రాయేలీయులకు మాత్రమే వర్తించదని కొందరు వ్యాఖ్యానకర్తలు అంటారు. అయితే, నిర్గమకాండములో ఈ పదము యొక్క ఉపయోగము ఈ ఆలోచనను వ్యతిరేకిస్తుంది (1:15, 16, 19; 2:6, 7, 11, 13; 3:18; 5:3; 7:16; 9:1, 13; 10:3). ఈ వాక్య భాగాలలో అనేక చోట్ల, దేవుడు "హెబ్రీయుల దేవుడు" అనగా ఇశ్రాయేలీయుల దేవుడు అని సంబోధించబడెను. అంతేగాక, సమాంతర వాక్య భాగములో హెబ్రీ దాసుడు "నీ సహోదరుడు" అని గుర్తించబడెను (ద్వితీ. 15:12). ధర్మశాస్త్రము హెబ్రీ బానిసలకు కొన్ని షరతులను విధించింది

మరియు ఇవి ఇతర బానిసలకు వర్తించలేదు. ఉదాహరణకు, యుద్ధములో సంపాదించిన బానిసలను ఆరు సంవత్సరాల తరువాత విడచిపెట్టివారు కాదు.

కొనుట ద్వారా దాసుడైన దాసుడు కేవలం "ఆరు సంవత్సరాల" పాటు మాత్రమే దాసుడుగా ఉండేవాడు అనేది సాధారణ నియమము; **ఏడవ సంవత్సరమున ఏమియు ఇయ్యకయే అతడు** లేక ఎవ్వరు తనను "విమోచించుటకు" వెల చెల్లించకుండా అతడు విడచి వెళ్లిపోవచ్చు. ఈ సందర్భములో బానిసత్వము ఒప్పందము దాసత్వము వంటిది: నియమించబడిన జీతము కొరకు ఒక దాసుడు కొన్ని సంవత్సరాలు పని చేసేవాడు, మరియు ఆ ధనము అతడు బానిస కాకముందు చేయబడిన అప్పులను చెల్లించుటకు ఉపయోగించేవారు. ఆరు సంవత్సరాలు గడచిన తరువాత, అతడు స్వతంత్రుడైయ్యేవాడు. ఆ దాసుని యొక్క యజమాని అతనిని వట్టి చేతులతో పంపకుండా, తన మందలో నుండి, ధాన్యములో నుండి, మరియు ద్రాక్ష రసము నుండి ధారాళముగా ఇచ్చి పంపాలని ద్వితీయోపదేశకాండము చెబుతుంది (ద్వితీ. 15:13, 14). ఈ నియమాలు స్త్రీలైన హెబ్రీ దాసీలకు కూడా వర్తిస్తుందని ఈ వాక్య భాగము తెలియజేస్తుంది (ద్వితీ. 15:12). కాబట్టి, యజమానునికి లేక అతని కుమారునికి భార్య అవ్వాలనే ఆలోచన లేకుండా స్త్రీలు కూడా దాసీలు కావచ్చు (21:7పై వ్యాఖ్యలను చూడండి).

**వచనములు 3-6.** ఇతర వివరణలు అనేక "అయితే . . . యెడల" పదాలతో ఇవ్వబడినాయి:

1. వాడు **ఒంటిగా** వచ్చిన యెడల - అనగా, అతడు వివాహము కాని వాడిగా ఆ గృహములో దాసుడైన యెడల - అతడు **ఒంటిగానే** వెళ్లవలెను (21:3a).

2. వానికి భార్య యుండిన యెడల, వాని **భార్య** వానితో కూడా వెళ్లవచ్చును (21:3b).

3. వాడు ఒంటిగా వచ్చి దాసునిగా ఉన్న సమయములో **భార్యను** పొందిన యెడల, అతడు **ఒంటిగానే** బయటకు వెళ్లవలెను, మరియు తన **భార్యను పిల్లలను యజమాని** యొద్ద విడిచిపెట్టవలెను (21:4). ఈ నియమము వినుటకు కఠినముగా ఉన్నప్పటికీ, దాసునికి మరియు యజమానికి ఇది తగినది.

4. ఒకవేళ, ఆ **దాసుడు** తన **భార్యను** మరియు **పిల్లలను** విడిచిపెట్టనొల్లక, **యజమానితో** ఉండగోరిన యెడల, ఆ దాసుని **దేవుని** (אֱלֹהִים, *ʼelohim*) యొద్దకు తేవలెను (21:5, 6). *ʼelohim* (or Elohim) అను బహువచనం దేవునికి బిరుదుగా ఉన్నప్పటికీ, అది ప్రజల యొక్క నాయకులు లేక న్యాయాధిపతులను కూడా సంబోధిస్తుంది. కొన్ని వెర్షన్లు దీనిని "దేవుడు" అని అనువదించగా (NASB; NRSV; REB; NAB; NJB), మరికొన్ని "న్యాయాధిపతులు" అని అనువదించాయి (KJV; NKJV; NIV). ఈ సందర్భములో, ఈ పదము దేవుని ప్రతినిధులను సంబోధించవచ్చు, వారు ఇశ్రాయేలు యొక్క పెద్దలు లేక యాజకులు కావచ్చు.

పరిశుద్ధ స్థలమందు, దాసుడు యజమానునితో ఉండునట్లు ప్రమాణము చేస్తాడు. తరువాత, **తలుపునొద్ద లేక ద్వారబంధమునొద్ద** అతని చెవి **గుచ్చబడుతుంది**. కొందరు వ్యాఖ్యనకర్తలు ఇది పవిత్ర స్థలము యొక్క ద్వారబంధములో జరుగుతుందని

చెప్పినప్పటికీ, ఈ చిహ్నాత్మక కార్యము యజమానుని ఇంటి యొద్ద జరుగుతుంది. చెవిలోని రంధ్రము, కొందరు దీనిలో ఒక పేరు కూడా అమర్చబడుతుంది అని చెప్పినా, యజమాని యొక్క యాజమాన్యమునకు చిహ్నము. బానిస యొక్క స్థితిని మినహా ఈ చెవి గుచ్చుట దేనిని సంబోధిస్తుందో తెలియదు. అది యజమానుని మాట విని దానిని పాటించుటకు సముఖతను సూచించవచ్చు.

"ఒక హెబ్రీ దాసుడు హెబ్రీ యజమానికి నిరంతరము దాసుడైయుండుట అనేది లేనే లేదు" అని John J. Davis వ్రాస్తున్నాడు.[4] అయితే, ఒక హెబ్రీ దాసుడు తన యజమానికి జీవితాంతము కట్టుబడియుండుటకు నిర్ణయం తీసుకొనవచ్చు. తరువాత ఇవ్వబడిన నియమం ప్రకారం, ప్రతి ఇశ్రాయేలీ దాసుడు హిత వత్సరమైన యాబైయవ సంవత్సరములో విడిపించబడి తన సొంత దేశమునకు తిరిగివెళ్లుటకు అవకాశం ఇవ్వబడుతుంది (లేవీయ 25:10). అయితే, ఇశ్రాయేలీయులు అన్యులను దాసులుగా తీసుకొని నిరంతరము వారిని దాసులుగా ఉంచుకొనవచ్చు మరియు తమ పిల్లలకు కూడా వారిని అందించవచ్చు (లేవీయ 25:44-46).

## దాసీలు భార్యలుగా కొనబడుట (21:7-11)

**7ఒకడు తన కుమార్తెను దాసిగా అమ్మినయెడల దాసులైన పురుషులు వెళ్లిపోవునట్లు అది వెళ్లిపోకూడదు. 8దానిని ప్రధానము చేసికొనిన యజమానుని దృష్టికి అది యిష్టురాలు కానియెడల అది విడిపింపబడునట్లు అవకాశము నియ్యవలెను; దాని వంచించినందున అన్యజనులకు దానిని అమ్ముటకు వానికి అధికారము లేదు. 9తన కుమారునికి దాని ప్రధానము చేసినయెడల కుమార్తెల విషయమైన న్యాయవిధినిబట్టి దానియెడల జరిగింపవలెను. 10ఆ కుమారుడు వేరొక దాని చేర్చుకొనినను, మొదటిదానికి ఆహారమును వస్త్రమును సంపారధర్మమును తక్కువ చేయకూడదు. 11ఈ మూడును దానికి కలుగజేయని యెడల అది ఏమియు ఇయ్యక స్వతంత్రురాలై పోవచ్చును.**

**వచనము 7.** ఒక ఇశ్రాయేలీయుడు **తన కుమార్తెను దాసిగా** అమ్మినయెడల, **దాసులైన పురుషుల** కంటే భిన్నముగా ఆమెతో వ్యవహరించాలి. ఈ స్త్రీ యజమానునికి లేక యజమానుని కుమారునికి భార్యగా ఉండుటకు కొనబడెను అనేది ఇక్కడ ఆలోచన. ఒకవేళ యజమానుడు ఆ స్త్రీని తనకు భార్యగా ఉండుటకు కొనిన యెడల, ఆరు సంవత్సరాల తరువాత ఆమె విడచి వెళ్లలేదు. ఎందుకు? ఏ కారణము ఇక్కడ ఇవ్వలేదు. ఆమె ఇంటిలోనికి ప్రవేశించిన "వ్యాపార ఒప్పందం" ఆమె యజమానుని వివాహం చేసుకున్నప్పుడు అంత కంటే బలముగా పరిగణించబడేది. యజమాని మరియు దాసుని మధ్య వ్యాపార ఒప్పందం మరియు వివాహం ఒకటి కాదు. ఇక్కడ ఇవ్వబడిన ఉపాయము విడాకుల పట్ల దేవుని ఆలోచనను తెలుపుతుంది: ఆయన విడాకులను ద్వేషిస్తాడు (మలకీ 2:16).

**వచనములు 8-11.** ఆరు సంవత్సరాల తరువాత స్వతంత్రత పొందుకోలేని దాసీలకు ఈ నిషేధము తగినదేనా? ఈ కొనుగోలు ఇరు పక్షాల వారికి

ఉపయోగకరముగా ఉంటుందని ఈ విధి తలంచినప్పటికీ, ఇట్టి ఇచ్చి పుచ్చుకొనుటలో అనేక పరిణామాలు ఉండవచ్చు.

1. యజమానుడు వేరొక భార్యను తీసుకున్నను, కొనబడిన ఈ భార్యకు ఎల్లప్పుడు **ఆహారము**, **వస్త్రము**, [మరియు] **సంసారధర్మము** (21:10) జరుపవలెను.

2. యజమానికి ఆ భార్య అయిష్టంగా మారిన యెడల, ఆమె **విడిపింపబడునట్లు** అవకాశం ఇవ్వాలి (21:8). మరొక మాటలో, ఆ కొనుగోలు సంతృప్తికరముగా లేని యెడల, దాసీ యొక్క తండ్రి ఆమెను తిరిగి కొనవచ్చును. యజమానుడు ఆమెను **ఇతరులకు** అమ్మకూడదు, ఎందుకంటే అది ఆమెకు అన్యాయం చేసినట్లు అవుతుంది. ఈ మాట కేవలం అన్యులకు మాత్రమే సంబోధించబడినప్పటికీ, ఆమెను కొనిన వ్యక్తి ఆ స్త్రీని మూడవ వ్యక్తికి అనగా, ఆమెగాని ఆమె కుటుంబముగాని ఎలాంటి అనుబంధము కలిగిలేని వారికి అమ్మకూడదని దీని అర్థము కావచ్చు.

3. ఒకవేళ యజమానుడు తన **కుమారునికి** భార్యగా ఉండుటకు ఆమెను కొనిన యెడల, ఆమెను ఒక కుమార్తెగా పరిగణించాలి (21:9).

4. ఒకవేళ యజమాని ఆమెను కొని, భార్యగా చేసుకొని, ఆమెకు ఇవ్వవలసినవి ఇయ్యలేని యెడల, ఆమె **ఏమియు ఇయ్యక** స్వతంత్రురాలైపోవచ్చును (21:11). ఆమె స్వతంత్రత కొరకు వెల చెల్లించకుండానే ఆమె స్వతంత్రురాలాయెను.

నిర్గమ. 21:1-11 మరియు తరువాత ఇవ్వబడిన విధుల ప్రకారం పురాతన ఇశ్రాయేలులో బానిసత్వం ఒక జీవన శైలిగా ఉంది. ధర్మశాస్త్రము ఇవ్వబడక ముందు అది ఒక అంగీకరించబడిన వ్యవస్థ మరియు మోషే ధర్మశాస్త్రము దానిని తిరస్కరించలేదు. అయితే, బానిసత్వములో ఉన్న చెడు ప్రభావములు చాలా వరకు తీసివేయుటకు ధర్మశాస్త్రము దానికి కొన్ని షరతులు విధించింది.

Gordon D. Fee మరియు Douglas Stuart, ద్వితీ. 15:12-17పై వ్యాఖ్యానిస్తూ, బానిసత్వమును గూర్చిన నియమాల ద్వారా క్రైస్తవులు నాలుగు విషయాలను నేర్చుకొనగలరని చెప్పారు: (1) పాత నిబంధనలో బానిసత్వము కొరకు దేవుడు ఇచ్చిన నియమాలు కఠినమైనవి లేక ఘోరమైనవి కావు. (2) స్వతంత్రులను ప్రేమించినట్లే దేవుడు బానిసలను కూడా ప్రేమించాడు. (3) బానిసలు స్వతంత్రులుగా ఉన్నప్పటి కంటే దాసులుగా ఉన్నప్పుడే బాగుండునట్లు దాసత్వమును అభ్యసించవచ్చు. (4) యజమాని దాసునికి పూర్తిగా యజమానుడు కాడు. యజమానికి మరియు దాసునికి దేవుడే యజమాని.[5]

## వ్యక్తిగత గాయములను గూర్చి నియమాలు (21:12-27)

నిబంధనా గ్రంథములోని ఈ భాగములో, "వ్యక్తిగత గాయములు" - అనగా వ్యక్తులను హత్య చేయుట లేక గాయపరచుటకు సంబంధించిన నియమాలు ఉన్నాయి. ఈ విధులు మొదటిగా సాధారణ నియమమును ఇచ్చి తరువాత వాటిని ప్రత్యేక సందర్భాలలో ఉపయోగిస్తుంది.

## హత్య (21:12-14)

**[12]నరుని చావగొట్టినవానికి నిశ్చయముగా మరణశిక్ష విధింపవలెను. [13]అయితే వాడు చంపవలెనని పొంచియుండకయే దైవికముగా వానిచేత ఆ హత్య జరిగిన యెడల వాడు పారిపోగల యొక స్థలమును నీకు నిర్ణయించెదను. [14]అయితే ఒకడు తన పొరుగువాని మీద దౌర్జన్యముగా వచ్చి కపటముగా చంప లేచినయెడల వాడు నా బలిపీఠము నాశ్రయించినను వాని లాగివేసి చంపవలెను.**

**వచనము 12.** 20:23 మరియు 21:2 వలెనే, సాధారణ నియమమును తెలుపుట ద్వారా ఈ వచనం క్రొత్త భాగమును ఆరంభిస్తుంది. ఇది ఆరవ ఆజ్ఞపై ఆధారపడియుంది (20:13), అయితే ఒకడు హత్య చేసినప్పుడు ఇవ్వవలసిన శిక్షను ఇది జతపరుస్తుంది. కయీను యొక్క విలాపములో చెప్పబడిన (ఆది. 4:14) మరియు జలప్రళయం తరువాత నోవహుతో దేవుడు చేసిన నిబంధనలో ఇవ్వబడిన శిక్ష (ఆది. 9:6) వంటిదే ఈ శిక్ష: హత్య చేసినవానికి **మరణ శిక్ష** విధింపబడవలెను.

**వచనము 13.** సాధారణ నియమమును ప్రత్యేక వ్యాజ్యాలలో ఎలా అన్వయించాలో ఉదాహరించు పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగిస్తారు. ధర్మశాస్త్రము హత్య మరియు అనుకోకుండా చంపినదాని మధ్య తారతమ్యమును చూపిస్తుంది. ఉద్దేశము పరిగణలోనికి తీసుకొనబడుతుంది: ఒక వ్యక్తి మరొక వ్యక్తిని **పొంచియుండకయే** చంపిన యెడల - అనగా హత్య కావాలని చేయని యెడల - ఆ వ్యక్తి హత్యకు దోషి కాదు. వాడు దాగుకొను ఒక స్థలమునకు (సంఖ్యా. 35 చూడండి)[6] పారిపోగలడు, మరియు అక్కడ వానికి తీర్పు తీర్చబడుతుంది. "కావాలని చేసిన హత్యకు" అతడు దోషి కానియెడల, ప్రధాన యాజకుడు మరణించునంత వరకు అతడు వేరొక పట్టణములో ఉండి మరణమును తప్పించుకొనవచ్చు (సంఖ్యా. 35:25, 28; యెహో. 20:6).

**వచనము 14.** మరో వైపు, అతడు **తన పొరుగువాని** మీద **దౌర్జన్యముగా** వచ్చి **కపటముగా చంపలేచిన యెడల**, అతనిని విడిచిపెట్టకూడదు. అతడు **బలిపీఠము** యొక్క కొమ్ములను పట్టుకొని శిక్షను తప్పించుకోవాలని ప్రయత్నించినా, వానిని లాగి **చంపవలెను** (1 రాజులు 2:28-34 చూడండి). మరొక మాటలో, ఒకడు మరొకరిని చంపాలని ప్రయత్నించి దానిని కావాలని చేసినయెడల, అతడు హత్యకు దోషిగా ఉండి చంపబడవలెను.

## ఇతర మరణ శిక్షలు (21:15-17)

**[15]తన తండ్రినైనను తల్లినైనను కొట్టువాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును. [16]ఒకడు నరుని దొంగిలించి అమ్మినను, తనయొద్ద నుంచుకొనినను, వాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును. [17]తన తండ్రినైనను తల్లినైనను శపించువాడు నిశ్చయముగా మరణశిక్ష నొందును.**

ఒక వ్యక్తిని చంపుటను గూర్చి ఇచ్చిన నియమాల తరువాత మరణ శిక్ష పొందవలసిన మూడు నేరములు ఇవ్వబడ్డాయి. ఈ మూడు నేరములు దేవునికి హత్య వంటి హీనమైన నేరములు. మొదటిది మరియు మూడవది ఒక వ్యక్తి తన తల్లిదండ్రులతో కలిగియుండవలసిన నియమాలను తెలుపుతుంది; రెండవది, ఒక వ్యక్తి యొక్క సొంత శరీర పవిత్రతకు సంబంధించినది.

**వచనము 15.** "నీ తల్లిదండ్రులను సన్మానించుము" (20:12) అను ఐదవ ఆజ్ఞకు ఇక్కడ మరింత వివరణ ఇవ్వబడినది. తన **తండ్రినైనను తల్లినైనను కొట్టువాడు** నిశ్చయముగా **మరణశిక్ష** నొందును.

**వచనము 16.** మరొకని **దొంగిలించువాడు** కూడా మరణశిక్ష నొందును. హత్య ఒకని జీవమును తీసివేయునట్లే, దొంగిలించుట కూడా ఒక వ్యక్తి యొక్క జీవితమును తీసుకుంటుంది - ఎనిమిదవ ఆజ్ఞ యొక్క ఉల్లంఘన (20:15). దొంలించబడినవానికి ఏమి జరిగినప్పటికీ, దొంగిలించినవాడు వాని జీవమును అపరాధిగా ఉన్నాడు. ఏ ఇశ్రాయేలీయుడు కూడా మరొకరిని బలవంతముగా బానిస చేసుకొనకూడదు, ఒకనిని దొంగిలించి వానిని దాసుని చేసుకొనుట అపహరణతో సమానం, మరియు దానికి **మరణశిక్ష** విధించబడుతుంది.

**వచనము 17.** ఐదవ ఆజ్ఞ మరొకసారి ఒత్తి చెప్పబడింది. **తన తండ్రినైనను తల్లినైనను శపించువాడు** దోషిగా నిలబడతాడు. ఒకని తల్లిదండ్రులను శపించు పాపము ఒకసారి చేయుటను గాక తరచుగా చేయు స్వభావమును సంబోధించవచ్చు. John H. Walton మరియు Victor H. Matthews ఇలా వ్రాసారు, "ఇక్కడ ఉల్లంఘన శపించుట కాదుగాని ఏహ్య భావముతో ప్రవర్తించుట."[7] ఏది ఏమైనా, "శపించుట" (קָלַל, *qalal*) అను పాదములో అలక్ష్యము చేయుట లేక త్రునీకరించుట అను ఆలోచన ఉన్నప్పటికీ (ఆది. 16:4, 5), ఎక్కువ బలమైన విధాలలో అది కనిపించినప్పుడు ఈ క్రియ ఒకనిని శపించుటను సంబోధిస్తుంది (ఆది. 12:3; లేవీయ. 24:14, 23; 2 సమూ. 16:5; సామె. 20:20; ప్రసంగి 7:21).

15 మరియు 17 వచనాలలో ఇవ్వబడిన నియమాల ఉల్లంఘన మరణ శిక్షకు దారితీయునంతగా అవి ఎందుకు అంత ప్రాముఖ్యమైనవి? తల్లిదండ్రుల యొక్క అధికారము పిల్లలపై దేవుని అధికారమునకు సూచనగా ఉండుట ఈ ప్రశ్నకు జవాబు కావచ్చు; ఒకని తల్లిదండ్రులను కొట్టుట లేక శపించుట దేవుని అధికారముపై తిరుగుబాటు చేయుటతో సమానము. అట్టి స్వభావం సమాజములో గలిబిలి కలిగిస్తుంది. తల్లిదండ్రుల పట్ల అవిధేయత మరియు అగౌరవమును దేవుడు ఘోరమైన పాపములుగా పరిగణిస్తాడు.

## కొట్టడం వలన కలిగిన గాయము (21:18-27)

మరణశిక్షార్థమైన నేరాల గురించి మాట్లాడిన పిమ్మట, హత్య గురించి కాక గుద్దుటను గూర్చిన నాలుగు సందర్భాలను వాక్యము మాట్లాడుతుంది. ఉద్దేశపూర్వకంగానో లేదా అనుకోకుండానో "గుద్దడం" లేదా గుద్దించుకోవడం అనే మాటలు అన్నిటిలో ఉన్నవి (21:18, 19, 20, 22, 26 చూడండి).

## మనుష్యులు పోట్లాడినప్పుడు ఒకడు మరొకడిని బాధపెడతాడు (21:18, 19)

**[18]మనుష్యులు పోట్లాడుచుండగా ఒకడు తన పొరుగువానిని రాతితోనైనను పిడికిటితోనైనను గుద్దుటవలన వాడు చావక మంచముమీద పడియుండి, [19]తరువాత లేచి తన చేతి కఱ్ఱతో బయటికి వెళ్లి తిరుగుచుండిన యెడల, వాని కొట్టిన వానికి శిక్ష విధింపబడదుగాని అతడు పనిచేయలేని కాలమునకు తగిన సొమ్ము ఇచ్చి వాడు అతనిని పూర్తిగా బాగుచేయింపవలెను.**

**వచనము 18.** సమర్పించబడిన మొదటి విషయములో, ఇద్దరు మనుష్యులు పోట్లాడుచుండగా ఒకడు మరొకని గాయపరుస్తాడు; గొడవకు స్పష్టంగా ఇద్దరు కూడా సమాతరంగా బాధ్యులు. ఎవరూ **చావకపోతే**, హత్యకు తగిన శిక్ష విధింపబడదు. గాయం ప్రమాదకరమైనది కాదు; కొట్టబడిన వాడు **మంచముమీద పడియుంటాడు**, కాని తరువాత స్వస్థపరచబడతాడు.

**వచనము 19.** ఒకవేళ గాయపడిన వ్యక్తి **తరువాత లేచి తన చేతి కఱ్ఱతో బయటికి వెళ్లి తిరుగుచుండిన యెడల** (ఇది ఊతకఱ్ఱతో నడచినదానితో సమానం), గాయం చేసిన వ్యక్తి యొక్క జరిమానా **అతడు పనిచేయలేని కాలమునకు తగిన సొమ్ము ఇవ్వడం.** మరో మాటల్లో, గాయపడిన వారు ఉద్యోగంలో పనిచేయగలిగినట్లయితే తాను సంపాదించగలిగే మొత్తమును గాయపరచినవారు పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. **అతడు పూర్తిగా బాగుపడేవరకు** గాయపరచిన వాడు శ్రద్ధ తీసుకోవాలి. మరొక మాటలో, గాయపడినవాడు స్వస్థపడేంత వరకు, అతడు గాయపరచిన వ్యక్తి యొక్క అవసరతలన్ని, ఆహారం మరియు వైద్య ఖర్చులతో సహా, తీర్చవలసిన బాధ్యత వానికి ఉన్నది.

## యజమానుడు తన దాసుని కొట్టినయెడల దాసుడు చనిపోతే (21:20, 21)

**[20]ఒకడు తన దాసుడైనను తన దాసియైనను చచ్చునట్లు కఱ్ఱతో కొట్టినయెడల అతడు నిశ్చయముగా ప్రతిదండన నొందును. [21]అయితే వాడు ఒకటి రెండు దినములు బ్రదికినయెడల ఆ ప్రతిదండను అతడు పొందడు, వాడు అతని సొమ్మేగదా.**

తరువాత నియమం (చట్టం) ఒక ప్రశ్నను ముందుగానే గ్రహిస్తుంది: “ఒకవేళ నేను ఎవరినైనా బాధపెడితే నేను బాధ్యుడను, కాని ఒకవేళ నా దాసుడను గాయపరిస్తే ఆ వ్యక్తిగత గాయం యొక్క నియమం వర్తిస్తుందా?” సమాధానం ఏంటంటే చట్టం వర్తిస్తుంది, కాని కొన్ని మార్పులతో. అది రెండు అవకాశాలను గూర్చి మాట్లాడుతుంది.

**వచనము 20.** మొదట, ఒకడు ఒక బానిసను చనిపోవునట్లు కొట్టవచ్చు. అలాటి పరిస్థితిలో, శిక్ష పేర్కొనబడకపోయినను, యజమానుడు **శిక్షించబడాలి.** భావన

ఏంటంటే యజమానుడు తన దాసుని క్రమశిక్షణలో ఉంచుటకు లేదా బహుశా దాసుని చంపాలనే ఆలోచన కలిగి అధిక శక్తిని ఉపయోగించియుండవచ్చు. అందుచేత, యజమానుడు శిక్షించబడాలి.

**వచనము 21.** రెండవదిగా, ఒకడు తన దాసుడను కొట్టుటను బట్టి ఆమె/అతడు **ఒకటి రెండు దినములు బ్రతికారు** కాని తరువాత చచ్చిపోయారు. ఇలాటి సమయంలో, యజమానుడు శిక్షించబడకూడదు. దాసుడు ఒక విలువైన **సొమ్ము** కాబట్టి దాసుడ్ని పోగొట్టుకోవడం అతనికి తగిన శిక్షగా ఉంటుంది. ఇక్కడ భావన ఏంటంటే, కొట్టిన తరువాత కూడ దాసుడు బ్రతికేయున్నాడు అను సత్యమును బట్టి చూస్తే యజమానుడు తన దాసుడ్ని చంపుదామని అనుకోలేదు.

ఇరవై - ఒకటవ శతాబ్దంలో జీవిస్తున్న ప్రజలకు, ఒక యజమాని అనుకోకుండా తన దాసుడను చంపగలడు అని చెప్పే నియమం క్రూరంగా కనిపిస్తుంది. ఈ చట్టం దాసులను (బానిసలను) సొమ్ముగా వర్గీకరించినను, వారు కేవలం సొమ్ముగా పరిగణించబడలేదు అను మాటను గమనించాలి. పాత నిబంధన వ్యవస్థలో, బానిస (దాసుడు) వస్తువుల్లో ఒకటిగా లేదా పెంపుడు జంతువుతో సమానుడు కాడు. ఒక మేజాబల్ల యొక్క యజమాని తన బల్లను బద్దలుకొట్టకుండా ఉంచుటకు, లేదా ఆవు యజమాని దానిని చంపకుండా ఉంచుటకు ఎటువంటి చట్టాలు లేవు. అయితే, ఒక దాసుడి (బానిస) యొక్క యజమాని అతనికి ఏమి చేయగలడో పరిమితం చేసే చట్టాలు ఉన్నాయి. బానిసలకు పరిమిత హక్కులే ఉన్నాయి, కాని హక్కులు మాత్రం ఉన్నాయి.

## మనుష్యులు పోట్లాడుచుండగా గర్భవతికి దెబ్బతగిలితే (21:22-25)

**22నరులు పోట్లాడుచుండగా గర్భవతియైనస్త్రీకి దెబ్బతగిలి ఆమెకు గర్భపాతమేగాక మరి ఏ హానియు రానియెడల హానిచేసినవాడు ఆ స్త్రీ పెనిమిటి వానిమీద మోపిన నష్టమును అచ్చుకొనవలెను. న్యాయాధిపతులు తీర్మానించినట్లు దాని చెల్లింపవలెను. 23-24హాని కలిగిన యెడల నీవు ప్రాణమునకు ప్రాణము, కంటికి కన్ను, పంటికి పల్లు చేతికి చెయ్యి, కాలికి కాలు, 25వాతకు వాత, గాయమునకు గాయము, దెబ్బకు దెబ్బయు నియమింపవలెను.**

**వచనము 22. హత్య గురించి చర్చించని** మూడవ విషయంలో, ఇద్దరు మనుష్యులు పోట్లాడుచుండగా ఒక గర్భవతియైన **స్త్రీకి** దెబ్బతగిలింది. ఆమెకు చేయబడిన హానికి జరిమానా ఏంటంటే గాయపడిన వారితో సమానమైన చెల్లింపు.

ఈ వచనాలకు సంబంధించి ఎగసే ప్రశ్న ఏంటంటే గాయపడిన స్త్రీ ముందుగానే జన్మనిస్తుందా లేదా ఆమెకు **గర్భపాతం** జరుగుతుందా. ఈ విషయంపై అనువాదాలు విభిన్నంగా ఉన్నాయి. NRSV, REB, NAB, మరియు NJBలో ఈ వచనములో "గర్భపాతం" అను పదం ఉంది. NIVలో వాక్యంలో "ఆమె ముందుగానే జన్మనిస్తుంది" అని ఉంది, కాని "గర్భపాతం" అని ప్రత్యామ్నాయ పఠనంగా సూచనలలో ఉంది. KJVలో The KJV "ఆమె గర్భఫలము ఆమెను విడిచి వెళ్లిపోయింది" అని ఉంది.

హెబ్రీ వాక్యం అక్షరార్థంగా చదువబడుతుంది: “వారు గర్భిణీ స్త్రీని కొట్టారు మరియు పిల్లలు [బహువచనము] బయటపడతారు మరియు గాయపడడం లేదు.” భాష అస్పష్టంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది: “బయటకు వచ్చే” బిడ్డ గర్భపాతం యొక్క ఫలితమా లేదా ముందుగానే జన్మనివ్వడమా అనేది వాక్యంలో స్పష్టంగా లేదు. గర్భపాతం కంటే ముందుగానే జన్మనివ్వడం అనే అర్థం వస్తుందని బలంగా చెప్పవచ్చు. Dónal P. O’Mathúna ఇలా వ్రాసాడు,

> క్రియ *yasa’* అంటే “బయటకు వెళ్లడం” లేదా “బయటకు రావడం” మరియు ఇది తల్లి గర్భము నుండి (ఆది 25:25-26; 38:27-30) లేదా వారి తండ్రి నడుమ నుండి (ఆది 15:4; 46:26) వచ్చే పిల్లల యొక్క సాధారణ జననాన్ని సూచిస్తుంది. కేవలం సంఖ్యాకాండము 12:12 మాత్రం నిర్జీవ జననమును వివరిస్తుంది, మరియు అక్కడ విషయం ఏంటంటే *yeled* కాదు, గాని *mwt*, అంటే చనిపోయినది. *Yeled* అను పదమును పిల్లలు (కొన్ని సందర్భాల్లో మానవ సంతానం కాని) అను అనువాదం కాక వేరే అనువాదం ఏదైనా ఉందంటే అది నిర్గమకాండము 21వ అధ్యాయము మాత్రమే. పంచ గ్రంథాలు మరొకచోట గర్భస్రావం గురించి వివరిస్తున్నప్పుడు, *sakal* అను పదం ఉపయోగించబడింది (ఆది 31:38; నిర్గమ 23:26). ఈ విధంగా, “ఆమె పిల్లలు బయటికి వచ్చారు” లేదా “పుట్టారు” అను అక్షరార్థ అనువాదము వైపు మొగ్గుచూపవచ్చు, కాబట్టి పుట్టని శిశువు సమయానికి ముందు బయటకు వచ్చుట ఇక్కడ అంశమవుతుంది, మరియు ఆ దెబ్బ యొక్క తీవ్రత ఆధారంగా మరియు పిండము యొక్క వయసు ఆధారంగా వేర్వేరు దెబ్బలకు దారితీయవచ్చు.[8]

గర్భస్రావమును గూర్చి ప్రత్యమ్నాయ ఆలోచనకు పశ్చిమ ఆసియాలోని సమాంతర చట్ట గ్రంథాలు మద్దతు పలుకుతాయి. ఆ ప్రతి ఒక్క సందర్భంలో, స్త్రీ యొక్క బిడ్డ చనిపోతాడు.[9]

**ఏ హానియు రానియెడల** అను పదజాలం కూడ పరిగణించాల్సిన అవసరం ఉంది. స్పష్టంగా, గాయం ఉంది. లేకపోతే, నష్ట పరిహారము చెల్లించాల్సిన అవసరం లేదు. అందుచేత, అనేక అనువాదాలు “గాయము” అను పదమునకు ఒక మార్పును జోడించడం జరుగుతుంది 22: “*తీవ్రమైన* గాయం కాదు” (NIV), “*శాశ్వత* హాని కాదు” (NKJV), “*ఇకమీదట* హాని లేదు” (NRSV) (ఒక్కాణం చేర్చబడింది). ఒకవేళ జన్మించని బిడ్డ గర్భస్రావమునకు గురైతే లేదా “ముందుగానే పుడితే” హాని కలుగుతుందని సందర్భం ఖచ్చితంగా సూచిస్తుంది. హాని కలిగించిన వ్యక్తి ఆ స్త్రీ **పెనిమిటి** పరిహారమును చెల్లించాలి. జరిమానా మొత్తం భర్త కోరిక మేరకు లేదా న్యాయాధిపతుల తీర్పును బట్టి నిర్ణయించబడుతుంది. పర్యవసానంగా, “ఏ హానియు” అని వాక్యభాగం స్పష్టంగా చూపిస్తుంది.

“మరింత గాయం” కలిగితే - ఉదాహరణగా, ఒకవేళ, స్త్రీ తీవ్రంగా గాయపడితే - అదనపు పరిహారం ఉంది, అది తరువాత మూడు వచనములలో వివరించబడింది.

**వచనములు 23-25.** మనుష్యులు పోట్లాడుకొనుట ముందుగానే జన్మించిన బిడ్డకు సంబంధించి ఒకవేళ హాని కలిగితే, ప్రాణమునకు ప్రాణము, కంటికి కన్ను,

పంటికి పల్లు చేతికి చెయ్యి, కాలికి కాలు, వాతకు వాత, గాయమునకు గాయము, దెబ్బకు దెబ్బయని ఇశ్రాయేలీయులు ఆజ్ఞాపించబడ్డారు.

బిడ్డ యొక్క అకాల పుట్టుక ఫలితంగా వచ్చు చిన్న హాని మినహా "హాని కలిగితే," దానికి అదనపు జరిమానా విధించబడుతుంది. ఎంత? గాయం యొక్క పరిధిని బట్టి శిక్ష అనుభవించాల్సి ఉంటుందను నియమమును ఈ వచనములు తెలియజేస్తాయి. సాధారణంగా, చేసిన హానిని బట్టి శిక్ష ఉంటుందని నియమం (చట్టం) బోధిస్తుంది.

"కంటికి కన్ను" అను చట్టం సాంకేతికంగా Latin పద సమూహమైన *lex talionis*గా పిలువబడుతుంది, అనగా "ప్రతీకార చట్టం." కొంతమంది దీనిని "ఇష్టానికి ఇష్టం" అను చట్టానికి చెందినట్లుగా సూచిస్తారు. ఇది పంచ గ్రంథాల్లో ఇతర సందర్భాల్లో రెండుమార్లు కనిపిస్తుంది. మొదట లేవీయకాండము 24:19, 20లో, శరీర గాయాలకు సంబంధించిన శిక్షను గూర్చిన సందర్భం. ఇంకొకటి ద్వితీ. 19:21, అబద్ధ సాక్ష్యమునకు సంబంధిచిన శిక్షను గూర్చి వివరిస్తుంది. చట్టం ఒక సాధారణీకరణ సూత్రం అంటే "శిక్ష నేరానికి సరిపోతుంది."[10]

బహుశా దేవుని ఆజ్ఞలు "కన్నుల నడుమ బాసికము" వలె ఉండవలెనను (ద్వితీ. 6:8) చెప్పిన ధర్మశాస్త్రము యూదులు అక్షరాల దట్టీలను (phylacteries) ధరించుట అని ఏ విధంగా అక్షరార్థంగా అనువదించకూడదో, అలాగే "కంటికి కన్ను" అను చట్టమును కూడా అక్షరార్థంగా తీసుకోనవసరం లేదు. కన్నును బయటకు పెట్టుట ద్వార లేదా చేతిని నరికిపేయడం ద్వార శిక్షించబడుటను గూర్చిన బైబిల్ సాక్ష్యం తక్కువ; ఉదాహరణలు ఏంటంటే ఇశ్రాయేలీయులు మరియు వారి శత్రువులు యుద్ధ సమయంలో (న్యాయాధి. 1:6, 7; 16:21; 2 రాజులు 25:7). ధర్మశాస్త్రంలో మరొక వాక్యభాగం మాత్రమే శరీర వినాశనమును కోరుతుంది (ద్వితీ. 25:11, 12) మరియు అది సూచించిన శిక్షను జరిగించారనడం జరగని పని.[11]

వాస్తవంగా, నిర్గమ. 21లో గల సందర్భం "కంటికి కన్ను" అను సూత్రం యొక్క అక్షరార్థ అనువర్తనకు వ్యతిరేకంగా వాదిస్తుంది. ప్రాణమునకు ప్రాణమిచ్చుటను ఈ సూత్రం సూచిస్తుంది. ఒకవేళ అకాల (సమయము పూర్తి కాక మునుపు పుట్టిన) బిడ్డ మరణిస్తే ఏంటి? ఆ బిడ్డ మరణానికి కారకుడైన వాడు చంపబడాలా? నిర్గమ. 21 యొక్క సందర్భము, నరహత్యలను గూర్చి చెప్పడం లేదు గాని, మరణశిక్షార్థమైన నేరాలను గూర్చి తెలియజేస్తుంది. చట్టం యొక్క ఈ భాగంలో ఇవ్వబడిన సూత్రము ఏంటంటే మొదటి - స్థాయి హత్య ఒక ప్రధాన నేరం, మరియు ఇతర హత్యలు (ప్రధాన నేరాలు) కావు. మనుష్యులు కొట్టుకోవడం ద్వార అనుకోకుండా శిశువు తల్లికి హాని కలిగిస్తే అది నరహత్యగా పరిగణించబడదు; ఇటువంటి మరణము ఆకస్మికమే గాని ముందుగ ప్రణాళిక వేసింది కాదు.

అందుచేత, ఇది అన్యాయం కావచ్చు, ఎందుకంటే శిశువు యొక్క మరణానికి శిక్ష శిశువు చావడానికి కారణమైన వ్యక్తి యొక్క మరణము. అయితే ఈ వాక్యభాగంలో "ప్రాణమునకు ప్రాణము" అంటే ఏమిటి? శిశువు చనిపోయిన ఫలితంగా గాయపడిన పార్టీకి సరిపడినంత చెల్లించాలి అను అర్థమును ఇస్తుంది. వాస్తవానికి, సంఖ్యా. 35:31 ఈ విధంగా చెప్తుంది, విమోచన క్రయధనం ఇవ్వబడని ఒకే ఒక హత్య ఏంటంటే

హత్య.[12]

అందుచేత, "కంటికి కన్ను అను" నియమమును అక్షరార్థంగా తీసుకొనకూడదు: ఒకవేళ ఒకరు మరొకని కన్నును పెరికి వేసిన యెడల, అతడు తన కన్నును పెరికివేయనవసరం లేదు. తదుపరి, వ్యక్తిగత ప్రతీకారన్ని సమర్థించుకోడానికి ఈ చట్టం ఉపయోగించబడదు. "కంటికి కన్ను" అని తప్పుగా జవాబిస్తూ తమకు అన్యాయం చేసిన వారిపట్ల పగతీర్చుకొను వ్యక్తులకు ఇది అధికారమివ్వదు.[13] పాత నిబంధన గ్రంథంలో, క్రొత్త నిబంధన గ్రంథం వలె, ప్రతీకారము చేయుట దేవుని పని అని బైబిల్ బోధిస్తుంది (ద్వితీ. 32:35; 1 సమూ. 25:32-35; కీర్త. 94:1; సామె. 24:29; రోమా. 12:19). తదుపరి, ప్రతీకారము కొరకు ఎదురు చూడవద్దని దేవుడు ఇశ్రాయేలీయులను కోరుకొంటున్నాడు (లేవీయ. 19:18) మరియు వారి శత్రువులకు మేలు చేయుమని బోధిస్తున్నాడు (23:4, 5; సామె. 25:21, 22 చూడండి).

"రక్తమునకు ప్రతీకారము తీర్చుకొనుట" - చనిపోయిన వ్యక్తి యొక్క సమీప బంధువు - తన బంధువును చంపిన వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకొనుటకు పాత నిబంధన గ్రంథము అధికారం ఇస్తుంది (సంఖ్యా. 35:12-29). అయితే, రక్తమునకు ప్రతీకారము తీర్చుకొనుటకు ప్రయత్నిస్తున్న వ్యక్తి దగ్గర నుండి పారిపోయి దాగుకొనుటకు పట్టణములు కూడా ఉండేవి. అక్కడ నిందితునికి తీర్పు తీర్చబడేది. అతడు తప్పుచేయని వాడైతే అతడు నగరంలో శరణుజొచ్చేవాడు. అతడు హత్య చేసిన నేరస్థుడైతే, అతడు రక్తమునకు ప్రతీకారము తీర్చుకొనివాని చేత, అనగా హత్య చేసినవానిని చంపుటకు *కోర్టు* (మరియు సామాజం) *యొక్క సాధనము* చేత చంపబడేవాడు. ఆ విధానమంతా చట్టము ద్వార నియంత్రించబడేది; *హంతకుడిని న్యాయం వద్దకు తెచ్చుటకు అది చట్టపరమైన మార్గం.* ఒక సైన్యం లేక రక్షక దళం లేని ప్రజలకు, ఇది అత్యంత ఉత్తమమైన న్యాయ వ్యవస్థ. వ్యక్తిగతంగా తమ చేతుల్లోకి చట్టమును తీసుకొని మరియు వ్యక్తిగత ప్రతీకరమును తీర్చుకోడానికి ఆ పద్ధతి ఒప్పుకోదు.

క్రొత్త నిబంధన తెలిసిన వారికి, చట్టము వ్యక్తిగత ప్రతీకారమును ప్రోత్సహించదు అను ఆలోచన కొంత సందేహం కలిగించవచ్చు ఎందుకంటే వారు యేసు మాటలను జ్ఞాపకం చేసుకొన్నారు: "కంటికి కన్ను, పంటికి పల్లు అని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక, నిన్ను కుడి చెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము" (మత్తయి 5:38, 39). పాత నిబంధనతో పోల్చి చూస్తే యేసు బోధ విరుద్ధంగా ఉందని వారు అప్పుడు ఆలోచించారు. అయితే, నిజానికి పాత నిబంధన బోధించిన దానికి యేసు విరుద్ధంగా మాట్లాడుటలేదు గాని ఆ బోధనకు ప్రసిద్ధి చెందిన అపార్థమునకు వ్యతిరేకంగా మాట్లాడాడు. స్పష్టంగా, యేసు దినాల్లో, "కంటికి కన్ను" అను చట్టము వ్యక్తిగత ప్రతీకారాన్ని ఆమోదిస్తుందని కొంతమంది అనుకొన్నారు, కాని నిజానికి అది ఆమోదించలేదు.

యజమానుడు తన దాసుడిని (లేదా దాసిని) అందవిహీనంగా చేసినయెడల (21:26, 27)

**[26]ఒకడు తన దాసుని కన్నైనను తన దాసి కన్నైనను పోగొట్టినయెడల ఆ కంటి హానిని బట్టి వారిని స్వతంత్రునిగా పోనియ్యవలెను. [27]వాడు తన దాసుని పల్లయినను తన దాసి పల్లయినను ఊడగొట్టినయెడల ఆ పంటి నిమిత్తము వారిని స్వతంత్రులగా పోనియ్యవలెను.**

**వచనములు 26, 27.** "కొట్టుటకు" సంబంధించిన నాలుగవ విషయంలో దాసుని **కన్ను** లేదా **అతని పంటిని** ఊడగొట్టినను దానికి జరిమానా నియమింపబడింది. ఒకవేళ యజమానుడు ఏదైనా చేస్తే, జరిమానా ఏంటంటే దాసుడు/దాసి **స్వతంత్రులుగా** విడిచిపెట్టబడాలి. ఈ చట్టమునకు మరియు వచనములు 20 మరియు 21లో ఉన్నదానికి స్పష్టమైన వ్యత్యాసం ఏంటంటే, ఈ సందర్భంలో, కొట్టబడిన దాసుడు చావలేదు గాని గాయపరచబడ్డాడు.

సాధారణ నియమమైన "కంటికి కన్ను" అనేది దాసునికి ఎలా అన్వర్తించబడుతుందని వివరించడానికి ఈ చట్టము బహుశా నిబంధన గ్రంథంలో ఉంచబడింది. "కంటికి కన్ను" (21:24) అను పదసమూహము బాధపడ్డ వ్యక్తి స్వతంత్రుడు అని ముందుగానే ఊహిస్తుంది. "ఒకవేళ నేను నా దాసుడి యొక్క కన్నును పెరికి వేస్తే, నేను నా సొంత ఆస్తిని బాధపెట్టాను" అని దాసుని యొక్క యజమాని వాదించవచ్చు. దాసుని యొక్క కన్ను తన సొంతం కాదు - కాని నాది సొంతం, కాబట్టి నేను అతనికి చేసే హానికి పరిహారం చెల్లించవలసిన అవసరం లేదు. తన దాసుడికి హాని కలిగించిన యజమాని చేసిన హాని కొరకు దాసుని పరిహారమునకు ఋణపడియున్నాడని ప్రకటించుచు, ఇలాటి ఆలోచనను ఈ చట్టము (నియమను) తిరస్కరిస్తుంది. వాస్తవానికి, పరిహారం దాసుని యొక్క విలువకు అనగా ముప్పది తులముల వెండికి (21:32) సమానంగా ఉంటుంది. ఈ పరిహారమునకు "చెల్లింపు" దాసునికి "అతని' ఆమె స్వతంత్ర్యమును ఇస్తుంది. మరలా, బానిసత్వం బానిస యొక్క వ్యక్తిత్వాన్ని లేదా విలువను నిరాకరింపదు అని ఈ చట్టం తెలియజేస్తుంది.

## ఎద్దులను గూర్చిన నియమం (21:28-36)

21:28-36లో ఉన్న నియమాలు ఈ విషయంలో ఉమ్మడిగా ఉన్నాయి: ప్రతిదీ "ఎద్దు" (שׁוֹר, *shor*)ను గూర్చి చెప్తున్నాయి. ఎద్దు అతిపెద్ద, అత్యంత ఖరీదైన మరియు అత్యంత ప్రమాదకరమైన దేశీయ జంతువు. ఎద్దుకు సంబంధించిన నియమాలు సందేహం లేకుండా ఏ విధమైన జంతువుకైన వర్తిసాయి. రెండు ప్రాథమిక పరిస్థితులు ఊహించబడ్డాయి: మొదటిది, ఎద్దు మనిషిని పొడవడం మరియు రెండవది ఎద్దుకు హాని కలగడం.

## ఎద్దు ఒక వ్యక్తిని గాయపరచినప్పుడు (21:28-32)

**[28]ఎద్దు పురుషునైనను స్త్రీనైనను చావ పొడిచిన యెడల నిశ్చయముగా రాళ్లతో ఆ యెద్దును చావకొట్టవలెను. దాని మాంసమును తినకూడదు, అయితే ఆ యెద్దు యజమానుడు నిర్దోషియగును. [29]ఆ యెద్దు అంతకు ముందు పొడుచునది అని దాని యజమానునికి తెలుపబడినను, వాడు దాని భద్రము చేయకుండుటవలన అది పురుషునైనను స్త్రీనైనను చంపినయెడల ఆ యెద్దును రాళ్లతో చావగొట్టవలెను; దాని యజమానుడు మరణశిక్ష నొందవలెను. [30]వానికి పరిక్రయధనము నియమింపబడినయెడల వానికి నియమింపబడిన అన్నిటి ప్రకారము తన ప్రాణ విమోచన నిమిత్తము ధనము చెల్లింపవలెను. [31]అది కుమారుని పొడిచినను కుమార్తెను పొడిచినను ఈ విధి చొప్పున అతడు చేయవలెను. [32]ఆ యెద్దు దాసునినైనను దాసినైనను పొడిచిన యెడల వారి యజమానునికి ముప్పది తులముల వెండి చెల్లింపవలెను, మరియు ఆ యెద్దును రాళ్లతో చావకొట్టవలెను.**

**వచనము 28.** మునుపటి చట్టాల వలెనే, ఈ వచనము సాధారణ చట్టమును పేర్కొంటుంది, మరియు తరువాత వచనాలు చట్టాన్ని ప్రత్యేక విషయాలపై అనువర్తిస్తుంది. ఇక్కడ సాధారణ నియమం ఏంటంటే **యజమానుడు** తన వ్యవసాయ జంతువు యొక్క ప్రవర్తనకు బాధ్యత వహించడు. ఒక వ్యక్తి కొన్నింటిని మాత్రమే నియంత్రించగలడు, గాని అతని నియంత్రణలో లేని వాటికి అతడు బాధ్యుడు కాడు. అయితే, ఒక మనుష్యుని చంపిన ఎద్దు రాళ్లతో కొట్టి చంపబడాలి, మరణశిక్షార్హమైన నేరం చేయుట ద్వార దోషిగా ఉన్న వ్యక్తులకు ఇది సహజమైన జరిమానా. ఎద్దు, "మానవుని వలె" రాళ్లతో కొట్టబడాలి, "ఎందుకంటె ఆ ఎద్దు రక్త నేరానికి పాల్పడింది (ఆది. 9:5)" అని R. Alan Cole వ్రాసాడు.[14] కొందరు దీనిని ఎద్దుకు అన్యాయంగా భావిస్తారు, ఎందుకంటె కొమ్ములతో పొడుచుట మృగం యొక్క స్వభావం కాబట్టి. అయితే, పాత నిబంధనలో మానవ జీవితంపై ఉన్న అధిక ప్రాధాన్యతను బట్టి, ఏదైనా మానవుని చంపినా యెడల అది శిక్షించబడాలి - అజ్ఞాన జంతువు కూడ. తరువాత, నిజానికి ఆ ఎద్దు "హంతకుడు," తినడానికి ఆ మాంసము సరైనది కాదు.

**వచనము 29.** వేరొక శిక్షను కోరు, మరొక సంభావన సాధ్యమే. **ఎద్దు** ప్రమాదకరమైనది అని **యజమానికి** తెలిస్తే - అతడు హెచ్చరించబడి కూడా ప్రమాదకరమైన జంతువును[15] **నిర్బంధించడానికి** ఏటువంటి చర్యలు చేపట్టకపోతే - ఎద్దు చేసిన దానికి అతడు బాధ్యత వహించవలసిందే. అప్పటికీ **ఎద్దు రాళ్లతో కొట్టి** చంపబడాలి, కాని ఈ సందర్భంలో అశ్రద్ధపరుడైన ఎద్దు యొక్క **యజమాని చంపబడాలి**. అందుచేత, అతడు హత్య చేసిన నేరస్తుడిగా ఉంటాడు మరియు ఇతరుల ప్రాణమును తీసుకొను ఆయుధమునకు సమానంగా ఎద్దు ఉంటుంది.[16]

**వచనములు 30, 31.** గాయపడిన ఎద్దును విడిచిపెడితే అది హత్యకు సమానము కాదు అని ఈ వచనాలు సూచిస్తున్నాయి. ఒకవేళ హత్యయైతే క్రయధనము అనుమతించబడలేదు (21:12), కాని వ్యక్తి యొక్క సమీప బంధువు ఎద్దు చేత పొడవబడితే ద్రవ్యనిధి పరిష్కారం కొరకు అడుగవచ్చు. ఇలాటి చర్య భూమి యొక్క

పెద్దల యెదుట న్యాయసమ్మతిలో జరగవచ్చు. ఎద్దుతో కూడ నేరస్తుడైన యజమాని యొక్క చావు కోరుకోకుండా ఎద్దు యజమాని యొద్ద నుండి **క్రయధనమును** సమీప బంధువు అడుగవచ్చు. ఒకవేళ అతడు అలాటిది ఎంపిక చేసుకుంటే, ఎద్దు యొక్క యజమాని **కుమారుని లేదా కుమార్తె యొక్క నష్టం** వలన **అతని యొద్ద నుండి ఆశించినది ఏదైననూ** అతడు చెల్లించాలి.

**వచనము 32.** బానిసలకు అనువర్తనతో సంబంధించి మునుపటి రెండు భాగాల వలే (21:20, 21, 27), ఈ భాగం ముగియబడింది. **ఒకవేళ** ఎద్దు, దాసుడ్ని పొడిచి చంపితే, దానిని ఏమి చేయాలి? మరల, **ఎద్దు రాళ్లతో కొట్టి** చంపబడాలి, ఆ ఎద్దు, నిజానికి, మానవుని హత్య చేసినట్లు సూచిస్తుంది. ఈ సందర్భంలో, ఎద్దు యజమానికి మరణశిక్ష ఉండదు. బదులుగా, అతడు (మరణించిన) దాసుని యజమానికి దాసుని విలువను: **ముప్పది తులముల వెండిని** చెల్లించాలి (జెకర్యా 11:12, 13; మత్తయి 26:15 చూడండి).

## యెద్దు గాయపరచబడినప్పుడు (21:33-36)

**[33]ఒకడు గోతిమీద కప్పు తీయుటవలన, లేక ఒకడు గొయ్యి త్రవ్వి దాని కప్పకపోవుటవలన, దానిలో ఎద్దయినను గాడిదయైనను పడిన యెడల [34]ఆ గోతి ఖామందులు ఆ నష్టమును అచ్చుకొనవలెను; వాటి యజమానునికి సొమ్ము ఇయ్యవలెను; చచ్చినది వానిదగును. [35]ఒకని యెద్దు వేరొకని యెద్దు చచ్చునట్లు దాని పొడిచినయెడల బ్రదికియున్న యెద్దును అమ్మి దాని విలువను పంచుకొనవలెను, చచ్చిన యెద్దును పంచుకొనవలెను. [36]అయితే అంతకు ముందు ఆ యెద్దు పోడుచునది అని తెలియబడియు దాని యజమానుడు దాని భద్రము చేయనివాడైతే వాడు నిశ్చయముగా ఎద్దును ఎద్దునియ్యవలెను; చచ్చినది వానిదగును.**

**వచనములు 33, 34.** ఎద్దుకు సంబంధించిన నియమాల యొక్క రెండవ భాగం, ఇతరులకు హాని కలిగించకుండా, అవి గాయపడే పరిస్థితిని గూర్చి మాట్లాడుతున్నాయి. రెండు పరిస్థితులు చిత్రీకరించబడ్డాయి. మొదటిది, **ఎద్దు లేదా గాడిద** తీయబడిన లేదా దాని యజమాని చేత కాక ఇతరుల వలన మూయబడకయున్న **గోతిలో** పడిపోవడం. గొయ్యి ధాన్యం కొరకు నీటిని నిలువ చేసే నీటితొట్టె అయ్యుండొచ్చు. **జంతువు** మరణమునకు బాధ్యత కలిగిన, **గొయ్యి యొక్క యజమాని**, దాని కొరకు చెల్లించాలి. ఒకవేళ గోతి యజమాని **నష్టపరిహారం** చెల్లిస్తే, అతడు ఆ జంతువు యొక్క శవమును ఉంచుకొనవచ్చు. హంతకుడు ద్వార నీ జంతువు కలుషితమవ్వలేదు కాబట్టి, దాని మాంసము తినవచ్చు.

**వచనములు 35, 36.** రెండవ స్థానంలో, ఒక మనుష్యుని ఎద్దు ఇంకొక మనుష్యుని ఎద్దును చంపితే, ఏమి చేయాలి? ఆ రెండు ఎద్దుల యజమానులు బ్రతికియున్న యెద్దును అమ్మి దాని విలువను పంచుకొనవలెను, అదేవిధంగా చచ్చిన యెద్దును పంచుకొనవలెను. మరల, మరొకని హత మార్చిన ఎద్దు అంతకు ముందు ఆ యెద్దు పోడుచునది అని తెలిస్తే దానికి ఒక మినహాయింపు ఉంది. "పొడిచే" ఎద్దు

యొక్క యజమాని దానిని విడిచిపెడితే, అప్పుడు అతడు మరొక యజమాని యొక్క చనిపోయిన ఎద్దు స్థానంలో ఎద్దుకు ఎద్దు ఇవ్వాలి. నష్టపరిహారం చెల్లించిన తరువాత, అతడు చనిపోయిన జంతువును ఉంచుకొని మరియు దాని మాంసమును ఉపయోగించుకోవచ్చు.

## అన్వయము

### "[నా] చెవిని గుచ్చవలెను" (21:2-6)

ఒక బానిస (దాసుడు) అవసరమైన సంవత్సరాలు సేవ చేసిన పిమ్మట, ఆయన ఒక స్వతంత్రుడిగా తన యజమానుని విడిచిపెట్టవచ్చును అని నిర్గమ. 21:2:6 బోధిస్తుంది. బానిస సంవత్సరాలలో అతడు భార్యను గాని, పిల్లల్ని గాని పొందుకుంటే, మరియు ఒకవేళ తన యజమానుని అతడు ప్రేమిస్తే, స్వతంత్రుడిగా ఉండకూడదని అతడు ఎంచుకోవచ్చు. తన స్వచ్ఛంద జీవితకాల సేవకు చిహ్నంగా, వాడు తన చెవిని గుచ్చించుకోవలెను.

"Pierce My Ear" అను పేరుతో ఒక ప్రసిద్ధి చెందిన భక్తి పాట ఈ వాక్యభాగం నుండి తీసుకొనబడింది.[17] తన యజమానుని వైపు బానిస యొక్క స్వచ్ఛంద భక్తి దేవునికి పరిచర్యకు ఒక విశ్వాసి యొక్క ఇష్టమును వ్యక్తం చేస్తుంది. ఒక వ్యక్తి యేసు కోరుకొన్న దానిని స్వేచ్ఛగా ఎన్నుకోవచ్చు; అయితే క్రైస్తవుడుగా మారుట వలన, అతడు జీవితాతం దేవునికి దాసుడిగా ఉండుటకు స్వచ్ఛందంగా ఇష్టత చూపుతాడు. అతడు ఎందుకు అలా చేయాలి? ఎందుకంటె అతడు యజమానుని ప్రేమిస్తున్నాడు (21:5)! నిజంగా, రెండు సంఘటనలు ఖచ్చితంగా సమాంతరమైనవి కావు. వాస్తవంగా, ఒకడు పూర్తి స్వతంత్రంగా ఉండలేడు. ప్రతి యొక్కడు పాపమునకు దాసులు లేదా నీతికి దాసులు (రోమా. 6:17, 18), మరియు ఇద్దరు యజమానులకు సేవ చేయడానికి ప్రయత్నిస్తే దానికి జీతం ఉంటుంది (రోమా. 6:23). "నా చెవిని గుచ్చవలెను" అని మీ యజమనునితో చెప్పుటకు మీకు అనేక కారణములు ఉండవచ్చు.

### దేవుని ప్రజలు మంచివారు (21:12-36)

ధర్మశాస్త్రము యొక్క న్యాయము మరియు దాని నియమాలు ఆకర్షించేవి (21:12-36). ఇతరులతో వ్యవహరించేటప్పుడు దేవుని ప్రజలు న్యాయంగా లేదా మంచిగా ఉండాలి (మీకా 6:8). అదేవిధంగా, క్రైస్తవులు న్యాయంగా ఉండాలి (మత్తయి 23:23). మనం ఉంటున్నామా? మనం ఇతరుల యొక్క అన్యాయ ప్రయోజనాన్ని పొందుకొంటున్నామా? మనం వ్యాపార లావాదేవీకి ప్రవేశించినప్పుడు, మన కొరకు మాత్రమే ఒక మంచి "ఒప్పందాన్ని" గురించి ఆలోచిస్తున్నామా? ఇతరులకు నష్టము కలిగించి లాభమును పొందుకొనుటను గూర్చి అతిశయపడుచున్నామా? మనకు కలిగిన దెబ్బలకు తగిన పరిహారం చెల్లించని పెద్ద సంస్థపై మనం కేసు వేయగలమా?

సూచనలు

[1]పదము యొక్క ఏకవచనము మీకా 6:8లో కనిపిస్తుంది మరియు "న్యాయము" అని అనువదించబడింది: "మనుష్యుడా, యేది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు, దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేగదా యెహోవా నిన్నడుగుచున్నాడు?" (ఒక్కాణం జతచేయబడింది.) [2]Walter C. Kaiser, Jr., "Exodus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers* (Grand Rapids, Mich.: Zondervan, 1990), 429. Kaiser యొక్క "పౌర" అను పదమును (పౌరులకు సంబంధించిన మాటను) ఉపయోగించిన విధానమును చూడగా అది ఆధునిక ప్రజలకు అర్థమైనప్పటికీ, తగినదిగా ఉన్నట్లు లేదు ఎందుకంటె బహుశా ఇశ్రాయేలీయులు "పౌర చట్టమునకు" మరియు "మతపరమైన చట్టమునకు" మధ్య వ్యత్యాసమును గుర్తించలేదు. వారి చట్టాలన్నీ దేవుడిచ్చినవే. [3]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 307, 320. [4]John J. Davis, *Moses and the Gods of Egypt: Studies in Exodus*, 2d ed. (Grand Rapids, Mich.: Baker Book House, 1986), 227. [5]Gordon D. Fee and Douglas Stuart, *How to Read the Bible for All Its Worth*, 3d ed. (Grand Rapids, Mich.: Zondervan, 2003), 174. [6]వచనము 13లో ఉన్న "స్థలము" అను పదమును ఇతర వ్యాఖ్యనకర్తలు వచనము 14లోనున్న బలిపీఠమును సూచించారు. H. L. Ellison, *Exodus*, The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1982), 125 చూడండి. [7]John H. Walton and Victor H. Matthews, *Genesis-Deuteronomy*, The IVP Bible Background Commentary (Downers Grove, Ill.: InterVarsity Press, 1997), 112. [8]Dónal P. O'Mathúna, "Bodily Injuries, Murder, Manslaughter," in *Dictionary of the Old Testament-Pentateuch* (Downers Grove, Ill.: InterVarsity Press, 2003), 93-94. [9]James B. Pritchard, ed., *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d. ed. (Princeton, N.J.: Princeton University Press, 1969), 175 (nos. 209-214), 181, 184-85 (nos. 21, 50, 53), 190 (nos. 17, 18); William H. Propp, *Exodus19-40: A New Translation with Commentary and Introduction*, Anchor Bible, vol. 2a (New York: Doubleday, 2006), 226-27. [10]See Martin Noth, *Exodus*, trans. J. S. Bowden, The Old Testament Library (Philadelphia: The Westminster Press, 1962), 182.

[11]మరొక వీక్షణం ఏంటంటే పురాతన ఇశ్రాయేలులో శారీరక వినాశనం ఏర్పడింది ("వాడు చేసినట్లు వాడికి చేయవలెను," లేవీయ. 24:19; "వానికి చేయవలెను," ద్వితీ. 19:19), కాని చివరకు ద్రవ పరిహారం ద్వార భర్తీ చేయబడింది. Josephus *Antiquities* 4.8.35; Mishnah *Baba Qamma* 8.1, 2 చూడండి. Pritchard, 175 (nos. 196-201)లో "The Code of Hammurabi" సరిపోల్చండి. [12]"ప్రాణమునకు ప్రాణం" అనే పదసమూహము ఒక మూసపోత వ్యక్తీకరణంగా పేర్కొనబడింది, లేవీయ. 24:18ని చూడండి: "జంతు ప్రాణహత్య చేసినవాడు ప్రాణమునకు ప్రాణనమిచ్చి దాని నష్టము పెట్టుకొనవలెను." ఈ శాసనం చనిపోయిన జంతువుల విలువకు సమానమైన ద్రవ్య పరిహారం చెల్లించాలని చాలా మంది అంటారు. జంతువును చంపితే దానికి ప్రతీకారంగా వేరొక జంతువును చంపనవసరం లేదు. [13]See Coy D. Roper, "'An Eye for an Eye': The Problem of Retaliation in Ancient Israel," *The Journal of Biblical Interpretation and Application* 1 (July-September 2002): 21-46. [14]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 170. [15]పోల్చదగిన చట్టాల్లో, "The Code of Hammurabi" యజమానుడు నగర పాలక

సంస్థ చేత హెచ్చరించబడ్డాడని సూచిస్తుంది. ఎద్దును కట్టివేయుట మరియు దాని కొమ్ములు కోయుట వంటి నివారణ చర్యల యొక్క ఉదాహరణలు కూడా ఉన్నాయి. Pritchard, 176 (no. 251) చూడండి. [16]ఆధునిక కాలంలో ఇటువంటి నియమాలే కనిపిస్తాయి. United States చట్టం జంతువుల యొక్క దుర్మార్గమునకు వాటి యజమానులే బాధ్యులని చెప్తుంది. [17]Steve Croft, "Pierce My Ear," © 1980 by Dayspring Music, http://www.mpcofc.org/youth/songs/songbook/song_book_page_3.htm (accessed Oct. 23, 2008).